

ఎమ్మెల్యే కోనప్ప సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన వేయి మంది యువకులు

# సిర్పూర్‌లో బీఆర్ఎస్ జోష్

- నియోజకవర్గంలో జోరుగా అభివృద్ధి
- నాలుగు రోజుల్లో రూ. 100 కోట్ల పనులకు శ్రీకారం
- ప్రచారంలో దూసుకెళ్తున్న గులాబీ సైన్యం
- ఎమ్మెల్యే కోనప్ప చేస్తున్న ప్రగతికి ఫిదా అవుతున్న యువత

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : సిర్పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జోష్ కనిపిస్తున్నది. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఓ వైపు వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతూనే.. ప్రచారంలో దూసుకెళ్తున్నారు. నియోజకవర్గ ప్రగతిని చూసి ఫిదా అవుతున్న వేలాది మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు.

### 4 రోజుల్లో రూ.100 కోట్ల పనులకు శ్రీకారం

సిర్పూర్ నియోజకవర్గంలో నాలుగు రోజుల్లో సుమారు రూ.100 కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. రూ.75 కోట్లతో కౌటాల మండలం గుండాయిపేట్ వద్ద వార్ధా నదిపై.. మహారాష్ట్రలోని నంది వర్ధనం గ్రామాన్ని కలుపుతూ మరో వంతెనకు శ్రీకారం చుట్టింది. ఇటీవల మంత్రి ఐకే రెడ్డి చేతుల మీదుగా వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ వంతెనలు పూర్తయితే సిర్పూర్ నియోజకవర్గానికే కాదు ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగుపడి అభివృద్ధి చెందే ఆస్కారమున్నది. అలాగే కౌటాల మండలం కోయగూడ గ్రామాన్ని ప్రధాన రహదారితో అనుసంధానం చేస్తూ రూ. 2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రవీంద్రనగర్‌లో 133 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి, చింతలమానేపల్లి మండలంలో గంగాపూర్‌కు రూ.2 కోట్లతో బీటీ రోడ్డు, కేతిని–దిందా మధ్య రూ.3 కోట్లతో రోడ్డు నిర్మాణం, రైల్వే గేటు నుంచి వంజిరి రోడ్డుకు రూ.కోటి, ప్రధాన రహదారి నుంచి నందిగూడ వరకు మరో రూ.కోటితో రోడ్ల నిర్మాణాకి శంకుస్థాపనలు చేశారు. అందెవెల్లి–ఈస్‌గాం మధ్య వాగుపై వంతెన నిర్మాణం, రూ.5 కోట్లతో అచ్చెల్లి–చింతగూడ, శివపురం–హీరాపూర్, పాతట్ల వంతెన నిర్మాణాలు, చింతలమానెపల్లి మండలం కర్జెల్లి రోడ్డుకు రూ. 1.95 కోట్లు, గంగాపూర్ రోడ్డు నిర్మాణానికి రూ. 2.60 కోట్లతో భూమి పూజ చేశారు.

### మహారాష్ట్రకు మూడో వంతెన...

రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని భావించిన సర్కారు.. పక్కనే ఉన్న మహారాష్ట్రకు రోడ్లు, వంతెనలు నిర్మిస్తున్నది. గతంలో వంతెన లేక ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రాణహిత నదిని నాటు పడవల్లో దాటి మహారాష్ట్రకు వెళ్లేవారు. ఈ సమస్యలను గుర్తించిన ప్రభుత్వం గూడెం వద్ద ప్రాణహిత నదిపై రూ.65 కోట్లతో భారీ వంతెన నిర్మించింది. దీంతో మహారాష్ట్రలోని అహేరి గ్రామానికి మెరుగైన రవాణా సౌకర్యం కలిగింది. తాజాగా వార్ధా నదిపై కౌటాల మండలం గుండాయిపేట్ వద్ద రూ.75 కోట్లతో మహారాష్ట్రలోని నంది వర్ధనం గ్రామాన్ని కలుపుతూ మూడో వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టింది. దీంతో ప్రజల మధ్య సత్సంబంధాలతో పాటు వ్యాపారాలు మెరుగుపడనున్నాయి.

### అటు అభివృద్ధి.. ఇటు ప్రచారం..

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సిర్పూర్ నియోజకవర్గంలో ఓ వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే ప్రచారంపై ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రత్యేక దృష్టిసారించారు. వేలాది మంది పార్టీ కార్యకర్తలు, నాయకులతో గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఇటీవల వేలాది మంది కార్యకర్తలతో కలిసి బైక్‌ర్యాలీ తీశారు. రైల్వేగేటు నుంచి వంజిరి, కాగజ్‌నగర్, చింతగూడ, కోయవాగు, అందవెల్లి, ఇస్గాం, నజ్రుల్‌నగర్, నామనగర్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపారు. సిర్పూర్ నియోజవర్గంలో కోనేరు కోనప్ప చేపడుతున్న అభివృద్ధి పనులకు ఫిదా అవుతున్న యువత, వివిధ పార్టీల్లోని కార్యకర్తలు పెద్ద ఎత్తు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఇటీవల మంత్రి ఐకే రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది యువత బీఆర్ఎస్ పార్టీలో చేరారు.



దిలావర్‌పూర్‌లోని డెలివరీ సిస్టర్న్ వద్ద ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న మంత్రి అల్లోల, కలెక్టర్ వరుణ్‌రెడ్డి





నిర్మల్ పట్టణంలో సమీకృత మార్కెట్ నిర్మించే స్థలం

# ప్రగతి పండుగకు రామన్న

## రేపు నిర్మల్ జిల్లాలో పర్యటించనున్న మంత్రి కేటీఆర్

- మంత్రి అల్లోలతో కలిసి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం
- ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ప్రగతి నివేదన సభ
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- పర్యటన, సభను విజయవంతం చేయాలని పిలుపు

నిర్మల్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ) : ఐటీ, పురపాలక, పారిశ్రామిక శాఖ మంత్రి కేటీఆర్ బుధవారం నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం, బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాట్లు ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా దిలావర్‌పూర్ మండలంలో రూ.714 కోట్లతో చేపట్టిన ప్యాకేజీ–27(శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి ఎత్తిపోతల పథకం)ను ప్రారంభించనున్నారు. అలాగే నిర్మల్ పట్టణంలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా రూ.23.91 కోట్లతో చేపట్టిన ఇంటింటికీ నల్లా నీటి సరఫరాను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి కేటీఆర్ ప్రారంభిస్తారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి పలుమార్లు ప్యాకేజీ–27 వద్దకు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంత్రి కేటీఆర్ కోట్లాది రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

### రూ.250 కోట్లతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ..

భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నది. నిర్మల్ జిల్లావ్యాప్తంగా 83,800 ఎకరాల భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 3,565 మంది రైతులు సాగు చేయగా, ఈ ఏడాది మరో 8 వేల ఎకరాల్లో మొక్కలను నాటించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం భారీ నర్సరీని సారంగాపూర్ మండలంలోని బీరవెల్లిలో ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రస్తుతం 13.65 లక్షల ఆయిల్ పామ్ మొక్కలు అందుబాటులో ఉన్నాయి. అయితే ఆయిల్ పామ్ రైతులకు భవిష్యత్‌లో మార్కెట్ సదుపాయాన్ని కల్పించి, వారిలో నమ్మకాన్ని పెంచేందుకు ప్రభుత్వం పామాయిల్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నది. ఇందుకోసం ప్రైవేటు కంపెనీలకు అవసరమైన ప్రోత్సాహకాలు కల్పిస్తున్నది. నిర్మల్‌తోపాటు చుట్టు పక్క జిల్లాల ఆయిల్ పామ్ రైతులకు ఆదాయం సమకూరేలా నిర్మల్ సమీపంలోని పాత పోచంపాడు వద్ద పామాయిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నది. ఈ పరిశ్రమ పనులకు బుధవారం మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా 250 మందికి, పరోక్షంగా మరో 750 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమలో ప్రస్తుతం గంటకు 15 టన్నుల పామ్ గెలలను మిల్లింగ్ చేసే సామర్థ్యం ఉన్నదని, భవిష్యత్‌లో దీనిని గంటకు 90 టన్నుల సామర్థ్యానికి పెంచుతామని పరిశ్రమ నిర్వాహకులు చెబుతున్నారు.

### సమీకృత మార్కెట్‌తో తీరనున్న ఇబ్బందులు..

కొత్త జిల్లాల ఏర్పాటుతో నిర్మల్ జిల్లా కేంద్రంగా ఏర్పడిన నేపథ్యంలో పట్టణం రోజు రోజుకూ విస్తరిస్తున్నది. దినదినాభివృద్ధి చెందుతున్న జిల్లా కేంద్రంలో ఎక్కడబడితే అక్కడ కూరగాయలు, మాంసం, చేపలు, పూలు, పండ్ల మార్కెట్లు ఉండడంతో పట్టణవాసులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు, వ్యాపారులు ఎండకు ఎండుతూ, వానలో తడుస్తూ కూరగాయలు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ క్రమంలో అటు వ్యాపారులు, ఇటు కొనుగోలుదారులు ఇబ్బందులు పడేవారు. ఈ ఇబ్బందులను తొలగించేందుకే సీఎం కేసీఆర్ పట్టణాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించి, ప్రతి నియోజకవర్గ కేంద్రంలో సమీకృత మార్కెట్లు నిర్మించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే నిర్మల్ పట్టణ నడిబొడ్డున సమీకృత మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2 ఎకరాల 30 గంటల్లో రూ. 10.15 కోట్లతో నిర్మించే ఈ మార్కెట్‌కు బుధవారం మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. జీ ప్లస్ వన్ తరహాలో నిర్మించే ఈ మార్కెట్‌లో కింది అంతస్తులో 136 కూరగాయల దుకాణాలు, మొదటి అంతస్తులో 34 మాంసం విక్రయ దుకాణాలు, నిత్యావసర సరుకుల కోసం మరో 18 కమర్షియల్ షాపులు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడి మార్కెట్ అందుబాటులోకి వస్తే అటు రైతులు, వ్యాపారులు, ఇటు కొనుగోలుదారులకు వేసవిలో, వానకాలంలో కలిగే ఇబ్బందులు తప్పనున్నాయి. అంతేకాకుండా వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపై నిలిపి కొనుగోలు చేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడేది. ఇక్కడ నిర్మించే సమీకృత మార్కెట్‌లో పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనుండడంతో ట్రాఫిక్ కష్టాలు కూడా తీరనున్నాయి.

### నిర్మల్‌లో భారీ బహిరంగ సభ..

మంత్రి కేటీఆర్ నిర్మల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేసిన అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఈ సభను విజయవంతం చేసేందుకోసం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నేతలంతా ప్రత్యేక దృష్టి సారించారు. నిర్మల్ నియోజకవర్గం నుండే కాకుండా, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచి కూడా భారీ సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు, పార్టీ అభిమానులు తరలిరానున్నారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మంత్రి కేటీఆర్ జిల్లాలో పర్యటిస్తుండడంతో బీఆర్ఎస్ శ్రేణులు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలను హైలెట్ చేస్తూ కేటీఆర్ పర్యటనకు రావాల్సిందిగా జనాన్ని ఆహ్వానిస్తున్నారు.

సమీకృత మార్కెట్ నిర్మాణ స్థలంలో శిలాఫలకాలను ఏర్పాటు చేస్తున్న కార్మికులు

- సోన్ మండలంలోని పాత పోచంపాడ్ గ్రామ శివారులో 40 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్లతో నిర్మించనున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నారు.
- నిర్మల్ పట్టణంలోని పాత తహసీల్ కార్యాలయానికి చెందిన 2 ఎకరాల 30 గుంటల్లో (రూ.10.15 కోట్లు) అధునాతన హంగులతో నిర్మించనున్న సమీకృత మార్కెట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. వీటితో పాటు నిర్మల్ పట్టణంలో చేపట్టే ఇతర అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు.
- నిర్మల్ పట్టణంలో రూ.2 కోట్లతో నిర్మించే ధోబీఘాట్ పనులు, రూ.4 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టే పలు అభివృద్ధి పనులు ఉన్నాయి.
- నిర్మల్ పట్టణంలో మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చేందుకు అమృత్ పథకంలో భాగంగా రూ.62.50 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇలా.. రూ.1,157 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్నారు. ఆయా పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించే ప్రగతి నివేదన సభలో కేటీఆర్ పాల్గొంటారు. మంత్రి కేటీఆర్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను స్థానిక మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మంత్రి కేటీఆర్ పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# ప్యాకేజీ-27తో బీడు భూములు సస్యశ్యామలం

- రేపు మంత్రి కేటీఆర్ జిల్లాకు వస్తున్నారు
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- హెలిప్యాడ్ పనుల పరిశీలన
- ఏర్పాట్లపై కలెక్టర్, పోలీస్, ఇరిగేషన్ అధికారులతో చర్చ

దిలావర్‌పూర్, అక్టోబర్ 2 : రైతులకు సాగు నీరు అందించి ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్మించి పూర్తి చేస్తున్నదని అటవీ, పర్యావరణ, దేవాదాయ, న్యాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్‌తో నిర్మించిన ప్యాకేజీ–27(శ్రీలక్ష్మీ నరసింహాస్వామి లిఫ్ట్ ఇరిగేషన్)ను మంత్రి పరిశీలించారు. అక్కడి నుంచి దిలావర్‌పూర్ వద్ద డెలివరీ సిస్టర్న్‌ను సందర్శించారు. అనంతరం అధికారులు మంత్రి సమక్షంలో ప్యాకేజీ–27 ట్రయల్ రన్ నిర్వహించారు. ఇది విజయవంతం కావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు సంబురాలు చేసుకున్నారు. ఏర్పాట్లపై కలెక్టర్, పోలీస్, ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. గుండంపల్లి పంప్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని, మోటార్లను పరిశీలించారు. అంతకు ముందు మంత్రి మాట్లాడుతూ.. ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ డెలివరీ సిస్టర్న్‌ను ప్రారంభించేందుకు రేపు (బుధవారం) వస్తున్నారని తెలిపారు. అనంతరం అక్కడే 500 మంది ప్రజాప్రతినిధులు రైతులతో కలిసి 20 నిమిషాలపాటు మాట్లాడుతారని పేర్కొన్నారు. నిర్మల్ నియోజవర్గంలో 50 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించామన్నారు. ప్యాకేజీ–28 పనులను కూడా త్వరలోనే పూర్తిచేసి సాగు నీరు అందిస్తామని తెలిపారు. మంత్రి వెంట కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ రామారావు, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఇరిగేషన్ డీఈ గంగాధర్, ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజీజ్‌ఖాన్, సహకార సంఘం చైర్మన్ రమణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్ముల దేవేందర్‌రెడ్డి, ఏలాల చిన్నారెడ్డి, రాంకిషన్‌రెడ్డి, అనిల్, గంగారెడ్డి, అడెపు శ్రీనివాస్, కోడే నవీన్, దనే రవి, సప్పల రవి, రాథోడ్ అశోక్, అరుణ్ ఉన్నారు.

### అధికారులకు సూచనలు చేసిన కలెక్టర్

కేటీఆర్ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, జిల్లా, మండల పరిషత్ అధికారులకు సూచనలు చేశారు. మంత్రి కేటీఆర్ వచ్చే రోడ్డు మార్గం గుండా మొక్కల చుట్టూ ట్రీ గార్డులు ఏర్పాటు చేసి, రంగులు వేయాలని సూచించారు. హెలిప్యాడ్ సమీపంలోని విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలను తొలగించాలని ఆదేశించారు.

### ఆయిల్ పామ్ పనుల పరిశీలన

సోన్, అక్టోబర్ 2 : నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని పోచంపాడ్ గ్రామంలో రూ.200 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులను అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరిశీలించారు. రేపు (బుధవారం) శంకుస్థాపన చేయడానికి ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ వస్తున్నందున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. శిలాఫలకం, సభావేదిక ఏర్పాటు చేయాలని సూచించారు. మంత్రి వెంట కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లా వెంకట్రామ్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, సర్పంచ్ గంగారెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మోహినొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్ రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సుభాష్‌రావు, ఆత్మ చైర్మన్ గంగారెడ్డి తదితరులు ఉన్నారు.



సోన్ : ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్

# అల్లరి

ALLARI

### పెద్దల మాట



నూనె వేస్తూ ఉంటేనే దీపం వెలుగుతుంది. మనం ప్రేమ చూపిస్తుంటేనే.. మనపైన ప్రేమ అనే ప్రకాశం పడుతుంది.

• మదర్ థెరిస్సా

### తెలుసుకుందాం



1. విద్యుదయస్కాంతం తయారీకి దేన్ని వాడతారు? • మెత్తని ఇనుము
2. 'మోదుగుపూలు' నవలను ఎవరు రచించారు? • దాశరథి రంగాచార్య
3. ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపం ఏది? • గ్రీన్ ల్యాండ్



కింది పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Nothing

Ex : Thin


## సమయం విలువ

పూర్వం హరి – గిరి అనే ఇద్దరు దోస్తులు ఉండేవాళ్లు. హరి రాజభవనంలో ఖజానాను చూసుకొనే ఉద్యోగం చేస్తుండేవాడు. గిరి మాత్రం ఏ పనీ చేయకుండా, సోమరిగా తిరిగేవాడు. ఒకరోజు గిరితో.. ''ఏదైనా పని చేసుకోవచ్చు కదా! ఊరికే ఇలా ఉంటే ఎలా?'' అని సలహా ఇచ్చాడు హరి. దానికి గిరి.. ''నాకు ఎవరూ పని ఇవ్వడం లేదు. ఎందుకంటే నేనంటే పడనివాళ్లు.. నేను చాలా బద్ధకస్తుణ్ని అని నాపై తప్పుడు ప్రచారం చేశారు!'' అని బదులిచ్చాడు. అప్పుడు హరి.. ''నేను ఎలాగూ ఖజానా చూసుకునే ఉద్యోగమే చేస్తున్నాను కదా! అక్కడి ధనాగారంలోని డబ్బును లెక్కపెట్టడానికి నీతిమంతులైన ఉద్యోగులు కావాలి. నువ్వు రేపు ఉదయాన్నే రాజ భవనానికి రా! పనికి తగ్గ ఫలితం ఉంటుంది!'' అని చెప్పాడు. గిరి ఇంటికి వెళ్లి తన భార్యతో విషయం చెప్పాడు. వెంటనే ఆమె కూడా.. ''ధనాగారంలో పని అంటే.. ఎంతో గౌరవం! నువ్వు రేపు ఉదయాన్నే వెళ్లి పనిలో చేరు!'' అని చెప్పింది.

తెల్లవారి ఆలస్యంగా నిద్రలేచాడు హరి. ఉద్యోగానికి వెళ్లాలని భార్య తొందరపెట్టినా.. హరి ఏమాత్రం పట్టించుకోలేదు. ''ఇప్పుడే ఎందుకు తొందర? ధనాగారం తెరవడానికి చాలా సమయం పడుతుంది. నేను భోజనం చేసి వెళ్తా! ముందైతే నాకు అన్నం పెట్టు!'' అన్నాడు. కడుపునిండా తిని, ఇంట్లోనే ఓ గంటసేపు విశ్రాంతి తీసుకున్నాడు. తర్వాత నెమ్మదిగా లేచేసరికి మధ్యాహ్నం అయింది. ఆదరాబాదరాగా రాజ భవనానికి బయల్దేరాడు. అది ఎండకాలం. దాంతో నడక వల్ల తీవ్రంగా అలసిపోయి.. మార్గమధ్యలో చెట్టు కింద ఆగి విశ్రాంతి తీసుకున్నాడు. అలసిపోయి ఉండటంతో.. వెంటనే కన్ను అంటుకుంది. నిద్ర లేచేసరికి పొద్దు వాలుతున్నట్లు గుర్తించాడు. హడావుడిగా లేచి.. మళ్లీ నడక మొదలుపెట్టాడు. తాను రాజభవనానికి చేరుకునే సరికే.. చీకటి పడే వేళయ్యింది. అప్పటికే ధనాగారంలో పనిచేసేవాళ్లంతా వెళ్లిపోయారు. హరి కూడా గిరి కోసం ఎదురు చూసీచూసీ, ధనాగారానికి తాళం వేసి వెళ్లిపోయాడు. గిరి వచ్చేసరికి మూసి ఉన్న ధనాగారం తలుపుల దగ్గర భటులు కావలి కాస్తూ కనిపించారు. దాంతో చేసేది లేక చింతిస్తూ.. ఇంటి దారిపట్టాడు. తన సోమరితనం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని బాధపడ్డాడు. సమయం విలువైందని గ్రహించకుండా దోస్తు ఇచ్చిన అవకాశాన్ని కోల్పోయాడు.

• కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి

కథ



జవాబులు

పూరించండి : BICYCLE, BAG



### టంగ్ ట్విస్టర్స్

Green glass globes glow greenly.

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం.
మా చిరునామా: zindagi@ntnews.com

### లిటిల్ హ్యాండ్స్

ఎ. వల్లభ్, సిద్దిపేట




### పూరించండి

బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి

